IJCRT.ORG ISSN : 2320-2882

INTERNATIONAL JOURNAL OF CREATIVE RESEARCH THOUGHTS (IJCRT)
An International Open Access, Peer-reviewed, Refereed Journal

# అంగర వెంకటశివ ప్రసాదరావు కథలు ` హాస్యం'

నద్దనపుట్టి గణేష్
పరిశోధక విద్యార్థి
తెలుగుశాఖ
ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం

ఆచార్య జర్రా అప్పారావు
పర్యవేక్షకులు
తెలుగుశాఖ
ఆంధ్ర విశ్వకళాపరిషత్
విశాఖపట్నం

పరిచయం :

మానవ మనస్తత్త్వాలలో కౌటుంబిక, నైతిక, మానవీయ విలువలను తన కథలలో నిబిడీకృతం చేసినవారు అంగర వెంకట శివ ప్రసాదరావు. అంగర వెంకట శివ ప్రసాదరావు 1949లో విశాఖపట్నంలో జన్మించారు. అంగర వెంకట నారాయణరావు, శాంతమ్మ వీరి తల్లిదండ్రులు. ఇతని భార్య సావిత్రి, ఎ.వి.ఎన్. కళాశాలలో బి.కాం వరకు చదివారు. కొంతకాలం ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసారు. తర్వాత కాలంలో కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. అసిస్టెంట్ మేనేజర్గా కూడా పని చేసి 2007లో రిటైర్మెంట్ అయ్యారు. వెంటనే గాయత్రి విద్యా పరిషత్ ఇంజనీరింగ్ కాలేజీలో ఉద్యోగంలో చేరారు. ప్రసాదరావు గారికి ఇద్దరు కుమారులు రవికాంత్, శశికిరణ్. అంగర వెంకట శివ ప్రసాదరావు రచయితగా ప్రోత్సహించింది పెదనాన్న అయిన శ్రీ అంగర వెంకట కృష్ణారావు. ఏది ఎలా రాయాలా ఏది రాయకూడదో చెప్పినది కృష్ణారావు, ప్రసాదరావు 100కు పైగా కథలు రాశారు. 2 నవలికలు రాశారు. ఈయన రాసిన కథల్లో కుటుంబ విలువలు ఎలా క్షీణిస్తున్నాయో తెలిపే ఇతివృత్తాలు ఉన్నాయి.

హాస్య సంబంధ కథలు :

సాహిత్యంలో హాస్య ప్రధానాలను రాయడం ఓ విధానం. ఏ ఇతివృత్తాలతోనైనా ఆకట్టుకోవడం, ఆలోచింపజేయడం రచయితల ప్రతిభకు నిదర్శనం. ఆస్తి ఒక ఎత్తైతే వినోదంతో మెప్పించడం మరో ఎత్తు. రాతలతో ఎదుటివారిని నవ్వించడం సామాన్య విషయం కాదు. అందుకే హాస్యపరమైనవి తక్కువ సంఖ్యలో వెలువడతాయి. నవ్వించడం అనేది ప్రధానమైన కథా వస్తువులు కూడా ఉంటాయి. ముఖ్యంగా దృశ్య శ్రవణాది నాటకాలలో అంగిక చేష్టలు, ఆకారాలు, మాటలు హాస్యభరితంగా ఉంటాయి. కానీ కథలలో అక్షరాలను నవ్విస్తూ రాయడం, నాటకీయతలోనికి పాఠకుని పంపి అలరించి సరదాని కలిగించడం కష్టతరం. ఇలాంటి కథలే రచయితలకు ఒక సవాల్గా ఉంటాయి. ఈ పరమైన వైవిధ్యం, నేర్పరితనం ఉన్న కొద్ది మంది సాహిత్యకారులలో అంగర వెంకట శివప్రసాదరావు గారికి సముచిత స్థానం ఉంది. వీరు రాసిన కథలలో కామెడీ కథలు ఒకటి. కొన్ని కామెడి కథలలో వేరొక ప్రధాన విశేషాలు ఉండటం చేత వాటిని ఇతర విభాగ, ఉపవిభాగాలలో వివరించారు. మరికొన్ని కేవలం హాస్యరీతిలో ఉండటం వలన ఈ విభాగంలోనికి చేర్చాను. అనగా పూర్తి హాస్య భరితమైనది మాత్రమే ఇక్కడ విశ్లేషించడం జరిగింది.

**క్రూరక్షేపం:**
**పరిచయం:**

'అంగర వెంకట శివప్రసాదరావుగారు' రాసిన ఈ కథానికను 'ఆంధ్రభూమి' సచిత్రవారపత్రిక ఫిబ్రవరి పద్దెనిమిది, 2016 సంచికలో ప్రచురించింది.

కథా సంగ్రహం :

సీతారామయ్య బడి పంతులుగా పనిచేసి పదవీ విరమణ చేస్తాడు. ఇంటివద్ద తిని కూర్చోవడం వల్ల సమయం దొర్లేదికాదు. ఓరోజు ఓ దినపత్రిక ఏజెంటు రాగా అతన్ని మాటల్లో ఉంచి కాలక్షేపం చేసేస్తాడు. తర్వాత ఇదేదో సరదాగా ఉందనుకొంటాడు. అలా సీతారామయ్య 'కర్మభూమి' ప్లాట్లను అమ్మేవ్యక్తితో, మరోరోజు చిలకజోస్యం వారితో, అలాగే 'కరోడా' బ్యాంకు నుండి వచ్చిన ఏజెంట్‌తో కాలక్షేపం చేసేస్తాడు. ఓ రోజు ఓ తివాచీలను అమ్మే వ్యక్తి వస్తాడు. ఒక్కో తివాచీ రెండు వేలనీ తన వద్ద ఏడు తివాచీలున్నాయని చెప్పి తన భార్యకు బాగోలేదని అత్యవసరంగా ఊరెళ్ళాలంటూ అన్ని తివాచీలకు ఏడు వేలిస్తే చాలంటాడు. సీతారామయ్య ఐదువేలు పెట్టి కొనేస్తాడు. తర్వాత అవి రంగుపోయి, చిరుగులు పడివుండటం చూసుకొని లబోదిబోమంటాడు.

విశ్లేషణ :

పదవీ విరమణ చేసాక ఓ మాష్టారు కాలక్షేపం కోసం హాస్యరీతిలో ఎలా సాగిందో చెప్తూ కథ నవ్వుని తెప్పిస్తోంది. సీతారామయ్య చేసే కాలక్షేపం అతనో చదువుకున్న వానిలా కాకుండా ఓ అమాయక చక్రవర్తిగా మాట్లాడటం కడుపుబ్బ నవ్విస్తోంది. కాకుంటే అతని మాటలు ఎలా ఉన్నా పాపం అంత ఓపికగా అతనిచే కొనిపించాలని ప్రయత్నించిన వారి తిప్పలు అన్నీ ఇన్నీ కావు. హాస్యం ఎప్పుడూ ఆనందాన్నే అందిస్తుంది. ఒక్కోసారి అది సమయాన్నెలా గడిచిపోయేలా చేస్తుందో చెప్పలేము. మాట్లాడేవాడికీ, అతని మాటలు వినేవారికీ సరదాని కలిగిస్తూ సాగడంలో ఒక ఆహ్లాదం కనిపిస్తుంది. ఉదాహరణకు సీతారామయ్య 'ఏనాడు' పేపర్ ఏజెంట్‌తో సాగించిన సంభాషణలో అతని మాటలిలా ఉన్నాయి.

"మాకో పేపరొచ్చి తగలబడుతుంది. కానైతే ` అన్నీ దిక్కుమాలిన వార్తలే ` ఒక్కటీ మంచి వారతలు వేసి తగలడడు. మీ పేపర్లో వార్తలు బావుంటాయా"

ఈ విధంగా మాట్లాడితే విన్నవాడు సీతారామయ్య ఓ అమాయకుడని తలచి వచ్చే నవ్వుని ఆపుకొంటూ బదులివ్వాల్సిందే పేపరు తగలబడుతుందనడం, దిక్కుమాలిన వార్తలనడం. మీ పేపర్లో వార్తలు బాగుంటాయా అంటూ ప్రశ్నించడంలో అసలతనికి పేపరు గురించి ఏమీ తెలియదన్నట్లున్నాయి. మామూలుగా అనేక సంస్థలవారు తమ అమ్మకాలను పెంచుకోడానికి ఇంటింటికీ తిరిగి అందరికీ తమ ఉత్పత్తులు ఎంత మంచివో వివరించి కొనిపిస్తుంటారు. ఇది వ్యాపారాలను లాభాలను పొందే ఓ మార్గం. అలాగే ఎం.బి.ఎ.లో మార్కెటింగ్ చదివే విద్యార్థులు ఇంటింటికీ తిరిగి వస్తువులను అమ్ముతుంటారు. వారంతా చాలా ఓపికగా అన్నింటినీ వివరించే ప్రయత్నంను ఒర్పుగా నిర్వహిస్తారు. ఇది వారి వృత్తిధర్మంలో భాగం కానీ సీతారామయ్యలాంటి ఒక్కడు తగిలినా వారి సహనానికి పరీక్షే ఈ కథను చదివి పాఠకుడు పొందే హాస్యాన్ని అక్కడ ప్రత్యక్షంగా చూసేవాడు పొందుతాడు. ఆ ప్రశ్నలు, జవాబులు అన్నీ నవ్వుని తెప్పిస్తాయి. అలా పేపర్లలో వార్తలు జరుగుతున్న వాస్తవాలను తెలుపుతాయి. వాటిని పనికిమాలినవిగా నిర్ణయించిన సీతారామయ్య మంచి వార్తలుండే పత్రికను అడగడం కుళ్ళిపోయిన కూరలు వద్దని మంచికూరలిమ్మనే కూరగాయల బేరంలా ఉందనే భావనను కల్పించి నవ్వించారు.

హాస్యం ఎప్పుడూ హృదయాన్ని తేలిక పరుస్తుంది. నవ్వితే ఎంత బాధనైనా మర్చిపోతాము. అసలే రిటైర్ అయిన సీతారామయ్య వంటివారు సందడి వాతావరణం నుండి ఒక్కసారిగా ఇంట్లో రోజంతా గడపాల్సి వస్తే అదే బాధలో ఉంటారు. అలాంటి వారికి కాసింత నవ్వుకోవడం అవసరం ఈ కాలక్షేపం తర్వాత క్రూరక్షేపంగా పరిణమించినా సరదాని పంచింది. వార్తలు మంచివి కావాలనుకోవడం, ప్లాటు ఉచితంగా ఇవ్వరా! అని ఇళ్ళ స్థలాలు అమ్మకానికి వచ్చిన వ్యక్తిని, చిలకజోస్యం వ్యక్తితో తానడిగిన ప్రశ్నకు చిలక సమాధానం చెప్పలేదనడం వంటివన్నీ పకపకా నవ్వుని తెప్పించేవే. సీతారామయ్య తివాచీల వ్యక్తితో మోసంపోయిన వైనం కూడా 'బాగా జరిగింది'. 'అలాగే జరగాలి' అని నవ్వుకుంటాం. కథ ద్వారా సమాజానికి ఒక మంచి సూచనలిచ్చారు. ఉద్యోగాలలో, వ్యాపారాలలో కష్టించి పనిచేయడం వయసులో ఉన్నంతవరకూ తప్పనివి. సంపాదనలతో బాధ్యతలు తీర్చుకొని విశ్రాంతిని పొందాల్సిన వృద్ధాప్యంలో నవ్వుతూ జీవించడం ప్రధానమన్నారు. వయసు ఉడుగుతున్నప్పుడు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. దిగులు, విచారం, ఒత్తిడి కలిగించే కాలక్షేపాల వంటి అర్థంపర్థం లేని ధారావాహికలను చూస్తూ లేనిపోని రోగాలను

కొనితెచ్చుకోవడం కన్నా నలుగురితో సరదాగా మాట్లాడుతూ సమయాన్ని గడపడం మంచిదన్నారు. ఉదయం సాయంత్రం నడకలు, లాఫింగ్ క్లబ్‌లు వంటి వాటితో కాలాన్ని గడుపుతూ ఆనందంగా, ఆహ్లాదంగా ఉండేలా జీవితాన్ని మలుచుకొంటే జీవిత చరమాంకం మనోల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇస్తుందని వివరించారు. నేటి ఒత్తిడుల మధ్య మనిషి కోరుకునేది హాస్యభరితంగా ఉంటూ సంతోషాన్ని అందుకోవడమేనని సూచనలిచ్చారు.

**ఝలక్:**

**పరిచయం:**

'అంగర వెంకట శివప్రసాదరావు' రాసిన ఈ కథను 'సహరి' అంతర్జాల వారపత్రిక అక్టోబర్ ముప్పై, 2020 సంచికలో వెలువరించింది.

కథాసంగ్రహం :

వరలక్ష్మి అనే యువతిని పెళ్ళిచూపులు చూసుకోడానికి శంకర్ కుటుంబం వస్తుంది. శంకర్‌ని ఆటపట్టించాలనుకొన్న వరలక్ష్మి, అతనితో మాట్లాడాలని కోరుతుంది. తనకు జాతకాలు చూడటం వచ్చుననీ తనకు సంతాన యోగం ఉందిగానీ శంకర్ జాతకంలో సంతానలోపం ఉందని చెప్తుంది. తర్వాతరోజు శంకర్ వరలక్ష్మికి ఫోన్ చేసి సంతానయోగం ఉన్నవాడినే చేసుకోమని తాను అరాకొరా సంతాన సాఫల్యం ఉన్న మరో అమ్మాయి సంబంధాన్ని నిశ్చయించుకొంటున్నానని చెప్తాడు. కథ అడ్డం తిరగడంతో తనకు శంకర్ నచ్చాడని సంబంధం ఖాయం చేసుకొంటున్నట్లు చెప్పమని తండ్రిని పోరుపెట్టి ఫోన్ చేయిస్తుంది వరలక్ష్మి, ఆమె తీరు అర్థం కాని వరలక్ష్మి తండ్రితో ఆమెకు ఒక చిన్న రaలక్ ఇచ్చానని చెప్పిన శంకర్ వివాహ సమ్మతిని తెలియజేస్తాడు.

**విశ్లేషణ:**

వివాహం చేసుకోబోయే యువతీ యువకుల మధ్య నడిచిన హాస్య కథ ఇది. పెళ్ళి అనేది ప్రతీ ఒక్కరి జీవితంలో మరపురాని ఘట్టం. పెళ్ళికిముందు పెళ్ళిచూపులు, పెళ్ళిమాటలు, నిశ్చితార్థం జరిగాక పెళ్ళిపందిట్లో బంధుమిత్రుల మధ్య మేళతాళాలతో యువతీయువకులు భార్యాభర్తలుగా మారుతారు. ఈ తంతు అంతా సాధారణంగా జరిగిపోతే సందడి ఉండదు. గడుస అమ్మాయి, చలాకీ అబ్బాయిలు తమకంటూ కొన్ని జ్ఞాపకాలుండాలని తమాషా పనులు చేస్తుంటారు. వివాహానంతరం జీవితాంతం ఆ హాస్య సంఘటనో, సందర్భానో మాటలనో పిల్లా పాపలకు వినిపించి సరదాగా గతాన్ని నెమరువేసుకొంటుంటారు. మనిషిని ఉల్లాసంగా ఉంచేది హాస్యమే కనుక నవ్వించే విషయాలతో యువతీ యువకులు సరదాలుపోతూ కొత్త కొత్త ఎత్తులు, పథకాలతో ఒకరిపై ఒకరి పైచేయిని నిరూపించుకొంటుండటం ఒక వినోదాత్మక వాతావరణాన్ని సృష్టిస్తుంది.

పెళ్ళనగానే జాతకాలు కుదరడం ముఖ్యం. వీటిలో అలా ఉంది ఇలా ఉంది అంటూ గడచిన పెట్టేస్తే అవతలివారు బెంబేలెత్తిపోతారు. సంబంధం, అమ్మాయి, కుటుంబం అంతా నచ్చిన తర్వాత ఈ జాతకాలేంటి ఇలా చేసాయని డీలా పడిపోతుంటే ఆ పాట్లు చూసి తెగనవ్వుకోవచ్చు. తర్వాత 'అరరే అన్నీకుదిరాయిగా' అంటే ఇంతసేపూ అయ్యో! అనుకున్నందుకు వారు, పెళ్ళికి ముందే భలే ఏడిపించామని వీరు కలసి నవ్వుకోడానికి బాగుంటుంది. వరలక్ష్మి అదే ఎత్తువేసి 'మీ తాత ముత్తాతల కాలంలో గంపెడు సంతానం వుండేది ` అలా క్షీణిస్తూ ` ఇప్పుడు ఒకటీ అరాకు దిగింది' అనగానే శంకర్ 'ఒకటంటే అర్థమైంది ` అదేంటండీ...'' అనగానే చదువుతున్న పాఠకునికైనా, వింటున్న వరలక్ష్మికైనా నవ్వురాక మానదు. అర బిడ్డలెలా ఉంటారనే ఆలోచనే హాస్యాన్ని పండిస్తుంది. వారికి పెళ్ళై పిల్లలు పుట్టాక అరబిడ్డ పుట్టిందా! అని పొట్టచెక్కలయ్యేలా నవ్వి ఆమెని మూతిముడుచుకునేలా చేయవచ్చు అసలు పెళ్ళికూతురే జాతకాలు తెలుసుననడం గురుడు అష్టమంలో, బుధుడు పంచమంలో అంటూ లెక్కలు కట్టడం ఓ నాటకీయతను సృష్టిస్తూ ప్రత్యక్షంగా వారి పాట్లను కళ్ళముందు నిలిపి హాస్యప్రవృత్తిని చాటారు.

భార్యాభర్తలిరువురి జాతకాల్లో సంతాన యోగం ఉండాలన్నప్పుడు 'మీ జాతకంలో వుందిగా మరంకేంటి' అంటూ అడల్ట్‌జోక్ వేయడంతో తప్పక ఇరువురికీ నవ్వువచ్చినా వరలక్ష్మి నిలదీయడం శంకర్‌కి సరదాగా అనిపిస్తుంది. నిజానికి వివాహ వేడుకలకు ముందు పెళ్ళిచూపుల్లో అబ్బాయికి వింతవింత వంటకాలు పెట్టి ఇబ్బంది పెట్టడం, మాటలతో అబ్బాయికి పరీక్షలుపెట్టి ఇబ్బంది పెట్టడం, పెళ్ళి సమయంలో పన్నీటిలో దురదగుంటాకు కలపడం, కాశీయాత్రం కార్యక్రమాల్లో, ఉంగరాలబిందెలో వేసి వెతుక్కోమనడంలు, తలంబ్రాలువంటివన్నీ హాస్యరీతిలో సాగుతూ కలకాలం నవ్వుకొనే గుర్తులను మిగల్చడంలో భాగమే. ఎందులోనూ అబ్బాయి, అమ్మాయి ఇద్దరూ తగ్గకుండా వరలక్ష్మి, శంకర్ జంట వలె పోటీలు పడటం భలేగా ఉంటుంది. ఇదంతా ఇరుకు కుటుంబాలను, కాబోవు భార్యాభర్తలను హాస్యరీతిలో దగ్గర చేసే సాంప్రదాయాల్లో భాగం 'నవ్వు' నాలుగు విధాల చేటు'

అనేది పాత మాట', 'నవ్వు నవ్వించు' అనేది నేటి మాట. సరదాగా నవ్వుకొంటే అది మనసుకి ఆహ్లాదమేగాక ఆ సందర్భాన్ని ఎప్పటికీ మరపురాని ముద్రగా ఉంచడం హాస్యానికి మాత్రమే సాధ్యం. కథనాన్ని నడిపిన విధానంలో ఆయా పాత్రల్లో వినోదరీతిని తీర్చిన తీరు సరదాగా సాగి అలరింపజేసారు.

**ఆధార గ్రంథాలు**:

1) క్రూరక్షేపం - అంగర వెంకటశివ ప్రసాదరావు
2) రaలక్ - అంగర వెంకటశివ ప్రసాదరావు
3) కథాశిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య